క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద కృష్ణ, మహేష్ బాబు యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాత కె.గోవిందరాజు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన మినీ కూలింగ్ చలివేంద్రంలో బుధవారం గ్రామస్తులకు వేసవి దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. దాతను పలువురు అభినందించారు.

300 మందికి అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వరుసగా 46వ వారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమెరికాకు చెందిన దాత అముక్త నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ట్రస్ట్ కార్యాలయంలో సుమారు 300 మందికి అన్నదానం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి ట్రస్ట్ సభ్యురాలు భాస్కరుని సుధారాణి ఫ్యాను, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు రోజుకు 300 రూపాయల వేతనం లభించేలా ఉపాధి సిబ్బంది కొలతలివ్వాలని ఆయన సూచించారు. ప్రతిరోజూ ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఫారం పాండ్స్, సోక్‌పిట్స్, క్యాటిల్ షెడ్లలో ప్రోగ్రెస్ పెంచాలన్నారు. ఉపాధి పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు అగ్రహారం భూముల పరిశీలన

ఒంగోలు టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక అగ్రహారంలో పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలను నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పరిశీలించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 23 వేల మందికిపైగా ఇంటి స్థలాలు పంపిణీ చేసిందని, అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని సాకులు చెబుతూ వాటిని రద్దు చేసి అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలన్న డిమాండ్‌తో సీపీఐ చేపట్టిన ధర్నాలో రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేడుకగా రాములోరి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో సీతారాములవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారి రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఉభయదాతలు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామోత్సవంలో కళాకారుల వేషధారణలు భక్తులను అలరించాయి.

ఆంజనేయా పాహిమాం

శ్రీరామ నవమిని పురస్కరించుకుని గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం సువర్చలా సమేత అభయాంజనేయస్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పూజా కార్యక్రమంలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోరా..?

- సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదు
- రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు
- సర్పంచ్‌లకు తెలియకుండానే, తీర్మానాలు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు
- జంగిల్ క్లియరెన్స్‌కు నగదు దండుకుంటున్నారు
- అధికారులు తీరు మార్చుకోవాలి
- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి హితవు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మూడు నెలలుగా సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొడుతున్నారని, మరికొందరు సెలవులు తీసుకుని సమావేశానికి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మెమో ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. సర్పంచ్‌లకు తెలియకుండా నిర్మాణాలు ఎలా కడతారని, బిల్లులు చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో వర్కులు పెడుతున్నామని, పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. మండలంలో అనేక మందికి రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. కె.పల్లెపాలెం గ్రామంలో ఎంపీపీ స్కూల్‌ను యూపీపీ స్కూల్‌గా మార్చడానికి ప్రతిపాదనలు పంపించాలని తీర్మానం చేయాలన్నారు. కొప్పోలులో చిన్న ఆక్వా రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి ఇన్ని రోజులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. కొత్తపట్నంలో మార్కెట్ యార్డ్ నిరుపయోగంగా ఉందని, శుభ్రం చేయించి ధాన్యం నిల్వ చేసుకోవడానికి ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలి...

ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని, ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర సరుకులు, ప్రభుత్వ రాయితీలు రావని తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. ఇంతలో రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది సరిగా ఉండటం లేదని, ఎన్నిసార్లు వచ్చినా అధికారులు ఉండటం లేదని ప్రశ్నించారు. రాజుపాలెంలో రొయ్యల ఫ్యాక్టరీని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, వెంటనే పనులు నిలుపదల చేయాలని కోరారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీలు ప్రతిఒక్కరికీ ఈ శ్రమ కార్డులు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అల్లూరులో ఎస్సీల శ్మశానానికి తాళ్ల చెరువులో 2.23 ఎకరాలు కేటాయించారని, దానిని సబ్‌డివిజన్ చేయాలని కోరారు. అల్లూరు హైస్కూల్లో విద్యార్థులు ఆడుకునే గ్రౌండ్‌పైన 33 కేవీ విద్యుత్ లైన్ ఉందని, విద్యార్థులకు ప్రమాదం ఉందని, దానిని పక్కకు మార్చాలని కోరారు. అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్, ఈతముక్కల ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఈతముక్కలలో గిరిజన కాలనీకి వెళ్లే రోడ్డు మధ్యలో తవ్వి పైపులైన్ వేయటం వలన గిరిజనులకు ఇబ్బందిగా ఉందని, ఎంపీటీసీలను పిలవకుండా అధికారులు ఇష్టమొచ్చినట్లు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొన్ని బిల్లులు ఆగిపోయాయని, అవి ఎప్పుడు పెడతారో చెప్పాలని కోరారు.

పశువుల నీటి తొట్ల నిర్మాణాలు ఎలా చేపడతారు.?

కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం లేకుండా, తనకు సమాచారం ఇవ్వకుండా పశువుల నీటి తొట్ల నిర్మాణాలు ఎలా చేపడతారని సభలో ప్రశ్నించారు. కె.పల్లెపాలెంలో చిన్న ట్రాన్స్‌ఫార్మర్లు తీసి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాలని విద్యుత్ అధికారులను కోరారు. రెవెన్యూ అధికారుల చొరవతో అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని, రెవెన్యూ సర్వేయర్లు వచ్చి కొలతలు కొలుస్తున్నారని, పర్మిషన్లు లేకుండా ఇష్టమొచ్చినట్లు చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్తపట్నం ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు మాట్లాడుతూ జంగిల్ కియరెన్స్ పేరుతో జేసీబీతో రెండు గంటలు పని చేయించి రెండు రోజులు బిల్లు చేసుకుంటున్నారని, దానికి అధికారులు ఎంబుక్‌లు ఎలా చేస్తారని ఈవోఆర్డీ వేణును ప్రశ్నించారు. ఇంతకముందు ఇదే విధంగా చేశారని, మళ్లీ ఇప్పుడు ఎలా చేస్తారని మండిపడ్డారు. కో ఆప్షన్ మెంబర్ బాజీ మాట్లాడుతూ ఇళ్లక విద్యుత్ మీటర్లను బాక్సులు లేకుండా బిగించారని, దానివలన విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయని ఎంపీపీ దృష్టికి తీసికెళ్లారు. అధికారులు ఒక్కొక్కరిగా పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాత ఉమామహేశ్వరి, ఎంపీడీవో శ్రీకృష్ణ, వ్యవసాయ శాఖ ఏవో మోహన్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఉద్యాన వనశాఖ అధికారి తేజ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చాకలి దిబ్బకు కొలతలు కొలిచి పొజిషన్ చూపించాలి...

గమళ్లపాలెం-వజ్జిరెడ్డిపాలేనికి సంబంధించిన చాకలిదిబ్బకు కొలతలు కొలిచి పొజిషన్ చూపించాలని గమళ్లపాలెం సర్పంచ్ భర్త బలగాని నారాయణ, చాకలి కమిటీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అడంగల్, ఆర్ఎస్ఆర్, మ్యాప్ చూపించారు. 1979 నుంచి చాకలి దిబ్బగా పేరుపొందిన స్థలం ఉందని, దానిని కొంత మంది తీసుకోవాలని చూస్తున్నారని, దానిని చాకలి వాళ్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో పొజిషన్ చూపించాలని కోరారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు



ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ఎంఈఓ ఆంజనేయులు

సంతనూతలపాడు: పోషణ పక్వాడాపై సంతనూతలపాడులోని ఒకటి, రెండు సచివాలయాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో డి.సురేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రక్తహీనత గల వారిని వైద్య సిబ్బంది గుర్తించి వారికి అన్నివిధాలా చేయూతనివ్వనున్నట్టు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు మండలంలోని అన్ని కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆరోగ్యం పట్ల వారిని మరింతగా చైతన్యపరచనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోషక పదార్థాలతో కూడిన బాల సంజీవనిని గర్భిణులు, బాలింతలకు ఎంపీడీవోతో పాటు మెడికల్ ఆఫీసర్ నాగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.నాగలక్ష్మి, ఆర్.పార్వతిబాయ్, మెడికల్ ఆఫీసర్ నాగరాజు, సీహెచ్‌ఓ ఆర్.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్‌కుమార్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: గర్భిణులు, బాలింతలు పోషణ లోపం లేకుండా చూసుకోవాలని ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు సూచించారు. బుధవారం మండలంలోని రాజువారిపాలెం, గాజులపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్ల వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుధవారం పోషణ పక్వాడ పక్షోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ కిశోర బాలికల్లో ఎక్కువగా పోషకాహార లోపం ఉంటుందన్నారు. ముఖ్యంగా గర్భిణులలో హిమోగ్లోబిన్ శాతం తక్కువ స్థాయిలో ఉండటంతో ప్రసవాలు కష్టమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా అందజేస్తున్న పోషకాహార పదార్థాలను తిని సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. రాచవారిపాలెం, కీర్తిపాడు పంచాయతీల పరిధిలో రక్తహీనత కలిగిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని వండుకునే విధానం, తదితర అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ప్రాజెక్టు సూపర్‌వైజర్లు తెలిపారు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వారు ఏ పోషక పదార్థాలు తినాలనే అంశం గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు నాగమల్లీశ్వరి, సీతమ్మ, మెడికల్ ఆఫీసర్ ఆనంద మోహన్, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పద్మావతి, జయలక్ష్మి, నాగరాజ, అంగన్‌వాడీ వర్కర్లు, బాలింతలు గర్భిణులు, వైద్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



నిరసన తెలుపుతున్న మహిళలు



చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు:

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక వడ్డెరపాలెంలో బుధవారం సాయంత్రం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు 50 రూపాయల చొప్పున పెంచడం దారుణమన్నారు. ప్రజల నెత్తిన గ్యాస్ సిలిండర్ల భారాన్ని వేయడం అమానుషమని అన్నారు. ప్రజల సంపాదనల కంటే ఖర్చుల భారం పెరుగుతోందని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయని అన్నారు. ఈ స్థితిలో భారాలు తగ్గించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇష్టారీతిన భారాలు మోపడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. గ్యాస్ ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను నిత్యం కేంద్ర ప్రభుత్వం పెంచుకుంటూ పోతోందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల ధరలు పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తామన్న సిలిండర్ల మీద కూడా ఈ భారం పడుతోందని, వెరసి ప్రజల మీద మోయలేని భారాలు అవుతాయని, వీటిని తగ్గించే వరకు ప్రజలు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు టి.అంకమ్మ, కే వైదేహి, రత్తమ్మ, రేణుక, కుంచాల పద్మ, కె.విజయ పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్:

పెంచిన పెట్రోల్, డీజిల్ రేట్లు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకుడు పమిడి వెంకటరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు చీమకుర్తి పట్టణంలోని బస్టాండు సెంటర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే మనదేశంలో మాత్రం కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్ గ్యాస్ రేట్లు పెంచడం సిగ్గుచేటైన విషయమని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికలముందు ధరలు పెంచమని చెప్పి గెలిచాక ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో బెజవాడ శ్రీను, టి.రామారావు, పి.సురేష్, ఓబులేసు, వెంకటేశ్వర్లు, నరసింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో ట్రాఫిక్ తగ్గించేందుకు చర్యలు



పశ్చిమ బైపాస్ గురించి కలెక్టర్, ఎంపీ, అధికారులకు మ్యాప్ ద్వారా వివరిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలులో ట్రాఫిక్ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అందులో భాగంగా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. సంబంధిత ప్రతిపాదనలపై కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో అధికారులతో ఆయన సమీక్షించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతో పాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్లించేందుకు పశ్చిమ బైపాస్ రోడ్డు ఎంతగానో దోహదపడుతుందన్నారు. త్రోవగుంట నుంచి పెళ్లూరు వరకు ఒంగోలుకు పశ్చిమం వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ అంశాలతో పాటు భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, సంతనూతలపాడు, కనిగిరి ఎమ్మెల్యేలు విజయ్ కుమార్, ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జెడ్పీ సీఈవో చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అనధికారిక లే అవుట్లతో నష్టపోవద్దు...

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని జేసీ, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఒనూడా) వైస్ చైర్మన్ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థిరాస్తి కొనుగోలుదారులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధి, ఈ విభాగం అందించే సేవలు, అనుమతులు, తదితర వివరాలతో పాటు స్థిరాస్తి కొనుగోలుదారులకు అవసరమైన సూచనలు చేసేలా రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, విజయ కుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఆవిష్కరించారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లు



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రజలు

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మలంపాడు సమీపంలో నిధి వద్ద గల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 60వ వార్షికోత్సవ తిరునాళ్లు బుధవారం ఘనంగా జరిగాయి. సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపూడి, కొండపి, టంగుటూరు, ఒంగోలు, పొదిలి, తదితర మండలాల నుంచి భక్తులు భారీగా తిరునాళ్లకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లతో ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి ఆలయ అర్చకులు అన్నావజ్జుల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శాండిల్యశర్మ, తదితర 25 మంది పండితుల బృందం పర్యవేక్షణలో ఆకు పూజలు, అష్టోత్తర పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బొడ్డపాటి రమణారావు వేడుకలను పర్యవేక్షించారు. గుమ్మలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. గుమ్మలంపాడు గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీస్ బృందం శాంతి భద్రతలను పర్యవేక్షించారు. విద్యుత్ ప్రభల వద్ద, ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, డ్రోన్లతో ఎస్సై అజయ్ బాబు పర్యవేక్షించారు. తద్వారా అసాంఘిక నృత్యాలు ప్రదర్శించకుండా చర్యలు తీసుకున్నారు.

స్వానిధి లబ్ధిదారులకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న కెనరా బ్యాంక్ ఆర్ఎం, కమిషనర్

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా లీడ్ బ్యాంకు, కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో పీఎం స్వానిధి లబ్ధిదారులకు బుధవారం ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. స్థానిక భాగ్యనగర్ రెండో లైన్‌లోని కెనరా బ్యాంక్ ఆర్ఎం కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఈ గొడుగులు చిరు వ్యాపారులకు ఎండ, వాన నుంచి రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. 100 మంది లబ్ధిదారులకు ఒక్కో గొడుగు రూ.1300 చొప్పున మొత్తం రూ.1,30,000 విలువైన గొడుగులు అందజేశామన్నారు. ఈ మొత్తాన్ని సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చిరు వ్యాపారులకు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, స్వానిధి లబ్ధిదారులు, కెనరా బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

తిరునాళ్లను ప్రశాంతంగా జరుపుకోవాలి

చీమకుర్తి రూరల్: చీమకుర్తిలో ఈ నెల 11వ తేదీ, రామతీర్థంలో 12వ తేదీ గంగమ్మ తిరునాళ్లను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌డీపీఓ ఆర్.శ్రీనివాసరావు సూచించారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో అన్ని పార్టీల విద్యుత్ ప్రభలకు సంబంధించిన నిర్వాకులతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రశాంతంగా తిరునాళ్లు జరుపుకోవాలని సూచించారు. కమిటీ మెంబర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ సుబ్బారావు వివరించారు.



చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో విద్యుత్ ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

5 క్వింటాళ్ల పొగాకు చోరీ!



పొగాకు పోయినట్లు చూపుతున్న రైతు మహేష్‌రెడ్డి

తర్లుపాడు: అసలే కరువుతో పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులు దొంగల బెడదతో మరింత మనోవేదనకు గురవుతున్నారు. గత నెలలో వ్యవసాయ మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలకొట్టి అందులో రాగి వైరును చోరీ చేసిన దొంగలు తాజాగా రైతులు పండించిన పొగాకు దొంగిలించి వారిని ఆవేదనకు గురిచేశారు. గత శుక్రవారం మండలంలోని నాయుడుపల్లికి చెందిన మహేష్‌రెడ్డి అనే రైతు తాను పండించిన పొగాకును పొలంలో మండె వేయగా గుర్తుతెలియని వ్యక్తులు 5 క్వింటాళ్ల మేర దొంగిలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు. రైతుల సొమ్ము కాజేస్తున్న దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.